# అంతిమ లేఖ

— కుమారి కె. హిరణ్మయి

వేణు రైలులో కూర్చున్నాడనే కాని అతని ఆలోచనలు రైలు కంటే వేగంగా పరుగెత్తుతున్నవి.... నెల్లూరు దగ్గర పడుతున్నకొద్దీ అతనిలో దుఃఖం అధికమౌతున్నది. తను ఉద్యోగములో చేరిన అయిదు రోజులకే సరోజను కాపురానికి తీసికొని వచ్చాడు.... కాని ఈనాడు తన సరోజ ని తనకు దూరమైంది.... ఈలా జరుగుతుందని కలలోకూడా అనుకోలేదు.. తనదాంపత్యము విచ్ఛిన్నమౌతుందని తను ఏకాకిగా బ్రతకవలసి వస్తుందని ఊహించుకొని కుమిలిపోతున్నాడు... రైలుదిగాడు.. ఎక్కడికి వెళ్ళాలి?.... ఇంటికివెళ్ళి ఉండగలడా ? ఎప్పుడూ తనప్రక్కన కూర్చొని ఉండే సరోజని లేకుండా గడపగలడా ? అయినా.... ఇంతలో వర్షం వచ్చే సూచనలలో గాలి వీచింది....నెమ్మదిగా తుంపర ప్రారంభమైంది.... ఆలోచనా నిమగ్నుడైన వేణు తిన్నగా ఇంటికి వెళ్ళాడు .... కాని లోపల ప్రవేశించటానికి అతనికి ఇష్టంలేకపోయింది.... తలుపు తెరవటంతోనే వెక్కిరిస్తున్నట్లుగా కవరు క్రింద పడింది.... ఆదుర్దాతో చూచాడు.... లైటు వెలుతురిలో తన సరోజని అక్షరాలు.... కనిపించినవి.... అతనికి పోగొట్టుకున్న వస్తువు జీవితంలో లభించనిది లభించినట్లుగా ఫీలయ్యాడు.... ఆదుర్దాతో చింతించాడు....

శ్రీవారి పాదసన్నిధికి....

మీ "సరూ" అంతిమ నమస్కారములు.

ఇదే నా చివరి ఉత్తరము కనుక సుదీర్ఘముగా వ్రాస్తున్నాను.... అందుకు క్షమించమని ప్రార్థిస్తున్నాను. నేను ఈవిధంగా చేశానని, ఆత్మహత్య ఘోర పాపమని మీరు భావించవచ్చు.... కాని పరిస్థితులను అర్థంచేసికోమని వేడుకుంటున్నాను.... జీవితాన్ని ఆనందమయంగా, అనురాగ పూరితంగా గడపాలని కలలు కన్నాను.... యౌవ్వనములోని వేడి నిట్టూర్పులు, వసంతంలోని వయ్యారాలు.... వలపులు తనివితీరా అనుభవించుదామనుకున్నాను... కాని పరాత్పరుడు నాకు ఆ అవకాశాన్ని ఇవ్వలేదు.... అయితే ఇదంతా మీకు తెలియదని కాదు.... నిజంగా మిమ్ములను భర్తగా పొందిన స్త్రీ ధన్యురాలు.... కాని నేనందుకు నోచుకోలేదు.... అదే నా నిస్పృహకు కారణము.... స్త్రీ జీవితంలో భర్త అనురాగాన్ని మించి కోరుకునేది ఏదీ ఉండదు.... కాని ఏదైతే నాకు ముఖ్యమో దేనినైతే జీవిత లక్ష్యముగా భావించి ఆరాధించానో అది గగన సదృశమైంది....జీవితములోని లక్ష్యము సాధించలేననే నిర్ణయించుకొని ఈపని చేశాను.... కాని మీరు "చచ్చి సాధించేదేముంది" అని అనవచ్చు.... కాని నేను బ్రతికి సాధించేది కూడా అదే.... ఇందువలన మీపై నాకు గల మమకారము, అనురాగము, అపేక్ష అర్థము చేసుకుంటే నా ఆత్మ కొంచెము తృప్తి చెందుతుంది.... ఈ విధంగా నా జీవిత నావ మధ్యలోనే మునిగిపోవటానికి నా జీవన కుసుమము పుష్పించక ముందే రాలటానికి మీరు కారణం కాదనేది నిజమే కాని అందుకు నేనే కారకురాలనన సాహసించలేను... ఇందులో మీ దోషము ఏమీ లేదనేది నిర్వివాదాంశము. అపోహలకు గాని, ఆరోపణలకుగాని ఎవరికీ ఆస్కారం లేకుండా చేయాలనే ఉబలాటము నన్నీ సుదీర్ఘలేఖ వ్రాయటానికి పురికొల్పింది.... నా హృదయావేదనను, నా ఆశయాలను మీకు తెలియజేసి నాలో రగిలే అగ్నిని మీ కన్నీటితో ఆర్పుకోవాలనుకున్నాను.... ఎప్పుడూ నిజాన్ని బయట పెట్టటానికి జంకలేదు. ఉన్న దున్నట్లుగా వ్రాస్తున్నాను.... ఇందులో అతిశయోక్తులు, అలంకారాలు లేవు.... ఇందుకు మీరు అభినందించకపోయినా అర్థంచేసుకుంటే చాలు....

నేను నిజంగా ఈర్ష్యా పూరితురాలనయ్యానా ! అనే సందేహం అప్పుడప్పుడు నాకే కలుగుతుంది.... కాని ఈర్ష్య స్త్రీల లక్షణమే ! ఈర్ష్య లేకపోతే ప్రేమ లేదనే సిద్ధాంతము నాది.... గుర్తుందా ! కృష్ణుని రుక్మిణి కంటే సత్య అధికంగా ప్రేమించిందని మీతో వాదిస్తుండే దానిని.... ఈ పాటికి మీ హృదయం అల్లకల్లోలమౌతుందని నాకు తెలుసు.... కాని ఏం చేసేది ? మీరు నవనీత హృదయులు.... ఆత్మ సౌందర్య విరాజితులు.... మీవంటి వారి ధర్మపత్నినై మిమ్ములను సుఖపెట్టలేకపోయాను.... అందుకు నా బాధ్యత ఎంతో ఉందని నాకు తెలుసు.... నా జీవిత వీణ ప్రథమంలో అపశ్రుతి పలికింది....సంధ్యారుణ కాంతులలోనే నీలిఛాయలు గోచరించాయి.... ఆదిలోనే హంసపాదు పడింది.... అంతే.... నా జీవితపథము నిర్గమమైంది.... ఒంటరిదాన్నై పోయాను.... ఇందుకు ఎవరు బాధ్యులు ? ఈ ప్రశ్న పదే పదే నాముందు నిలచేది ! అప్పుడు నా హృదయం పరి పరి విధాల పరుగులెత్తేది.... ఎవరిపై నెట్టగలను....? అమ్మా నాన్నా ! లేక ప్రాణప్రదంగా ప్రేమించి చదివించిన నా అన్ననా ! లేక ఏ పాప మెరుగని నన్నేనా ! ఇక మేమెవ్వరము కాకపోతే మీరా ! మీరందరూ నా శ్రేయస్సు కోరే వారే ! ఇందులో ఎవరిని నేను దోషిగా నిరూపించగలను ? దీనికి సమాధానం నాకు దొరకలేదు.... ఈ విషమ పరిస్థితికి నేను కారకురాలను కానని నాకంటే ముందుగా మీరే అంగీకరిస్తారు.... అయితే నాకెందుకీ శిక్ష.... నేనేం పాపం చేశాను ? నిరపరాధినైన నాకు ఇంత చిన్న వయసులో ఇంత వ్యధ ! అందరివలె నా జీవితాకాశంలో వెన్నెల రాత్రులు లేవా ! మలయ మారుతాలు ప్రసరించవా ? నా హృదయ

(తరువాయి 25 వ పేజీలో)

# అంతిమ లేఖ

(8 వ పేజీ తరువాయి)

వీణలో మోహన రాగములు వినిపింపవా? నా జీవితాకాశము సతతము అమవస నిశి ఏనా? నా వీణలో సదా శివరంజని రాగాలాపన రేనా? ఇవీ నా ఆలోచనలు....

మీరు కరుణామూర్తులు.... ఈనాడు నా జీవితం ఈలా నిప్పుల పాలైందని మిమ్ములను వేరుగా చూడలేను.... గుర్తుందా.... ఆనాటి పున్నమరేయి.... మైపాటి దగ్గర సాగర సమీపం....ప్రకృతి రమణీయకత సుధాంశుడు సాగరుని వెండి మలామా చేశాడు.... సతీష్ బాబూ.... రఘు.... మెల్లగాపోయి మీరు కూర్చున్నారు.... నేను, లలిత, పార్వతి, అలా ఇసుకలో మీ ప్రక్కన కూర్చున్నాము.... ఆకాశం నిర్మలంగా ఉంది.... సముద్రుడు 'శ్రీ' రాగంలో గానం చేస్తున్నాడు.... ఆ దృశ్యము నా మనసును పరవశింప చేసింది.... నా తనువు పులకరించింది.... మీ వడిలో కూర్చోవాలని.... మీ చేతులతో నా కపోలాలు తాకచేసికోవాలని, అమృతమయమూ, కరుణా నిలయమైన మీ వక్షస్థలంపై శయనించాలని నా హృదయం ఆ సముద్రంవలె ఉప్పొంగి పోయింది.... రేరాజు కిరణాలు నీటిపైపడి గాజులా మెరసిపోతున్నవి.... సతీష్ రాగాలాపన చేస్తుంటే మీరూ దివాకర బాబూ ఆనందిస్తున్నారు.... చూశారా! ఆనాడు లలిత పాట పాడింది.... అందరూ ఆమెను పాడమని బలవంతం చేస్తుంటే లలితా కుమారి గోముగా మారాము చేసింది.... కాని నేను పాట పాడగలనని, లలిత కన్నా లలితంగా పాడగలనని తెలిసి కూడా పాడమనలేదు. మీరు పాడమంటారని నా హృదయం ఎంతో ఆశించింది.... ఆ సమయంలో సంగీతము పొంగి పొర్లింది నాలో.... సాగర సమీపము నిండు పున్నమి.... పండు వెన్నెల.... మలయమారుతం.... అతి ప్రశాంత వాతావరణము.... ఇంత కన్నా ఏమి కావాలి సంగీతం పెల్లుబికటానికి.... అయితే సముద్రంవలె పొంగిన నా సంగీతం పాల పొంగే అయింది.... మీరు పాడమనలేదు సరిగదా నావైపు కూడా చూడలేదు... అప్పుడు నేను పొందిన వ్యధను వివరించగల పదాలు తెలుగు భాషలో లేవంటే అతిశయోక్తి కాదు.... చివరకు పార్వతీదేవి నన్ను పాడమని అన్నపుడు కూడా మీరు ఒక్క మాట అనలేదు. నాలో నేను కుమిలి పోయాను... ఏడ్చాను.... ఎంత ఏడ్చినా ఆ సముద్రమంత కన్నీరును కార్చగలిగితే బాగుండు ననిపించింది.... ఈ ప్రశాంత సమయంలో ఆనందం అనుభవించవలసిన నాకు ఏమిటో దుఃఖం.... సాగరా! నన్ను నీలో చేర్చుకో.... సమస్త ప్రాణికోటిలో సగం పైగా నీగర్భంలో ఉన్నయి.... నేను నీకు భారమౌతానా? కాని నాకు అంత అదృష్టము ఉందా? పార్వతిని, లలితను బ్రతిమిలాడారు.... సతీష్‌చేత పాడించారు. నన్ను అడగలేదు.... ఏం?.... నాపై మీకు ఆమాత్రము హక్కులేదా నేను మీ దానిని కానా? నన్ను శాశించలేరా! ఆనాటి సంఘటన నా హృదయ సంద్రాన్ని పూర్వము దేవదానవులు క్షీర సముద్రాన్ని చిలికినట్లు బాధ పడ్డాను.

ఇంతవర కెందుకూ! ఆ మొదటిరాత్రి నాడు.... ముద్దుగా అలంకరించిన గదిలో కూర్చుని ఉన్నారు మీరు. నేను మోయలేని సిగ్గుతో వచ్చాను.... నాకై నేను పలకరిస్తే మీరేమైనా అనుకుంటా రేమోనని మౌనంగా ఉన్నాను.... తలవంచుకొని.... అంతే.... మీరు నిద్రపోయారు.... ఎన్ని సారులు మిమ్ములను అడిగాను.... కాని నాపైగల ఉదాసీనతకు కారణం చెప్పారు కారు.... పోనీ నన్ను సరిగా అర్థం చేసికో లేదా? నన్ను కుంటిగా భావించారా? నా అంద చందాలలో లోపమా? కాదు.... వీటన్నిటికి మీరే సమాధానం చెప్పారు.... ఇందులో దేనికి నాపై నింద మోపలేరు... ఆనాటి నాహృదయతాపాన్ని మీమీ హృదయామృత ఝురీతో ఉపశమింప చేశారు....

నన్ను చాలా గారాబంగా చూశారు .... ఆమాట కాదనను.... నన్ను మీరు భార్యగా ఈనాటివరకు చూడలేదు.... ఎన్నోరాత్రులు మీతో ఒంటరిగా ఏకశయ్యపై గడిపాను... మీరు విడిచిన విస్తరిలో భోంచేశాను.... మీరే నాసర్వస్వమనుకున్నాను... అందుకు మీ ప్రవర్తన ఎంత వ్యతిరేకంగా ఉందో నాకంటే మీకే ఎక్కువ తెలుసు.... కాని మీకు నాపైగల ప్రేమ నిరుపమానము.... సన్నజాజి పందిరిక్రింద మీచెల్లి మనకు ప్రక్క వేసింది.... నీలి వెల్వెట్ పరుపు.. క్రింషన్ రంగు బ్లాంకెట్.... దానిపై మల్లెపూలు చల్లింది.... ఇవన్నీ చూస్తున్న నాకు ఇదంతా మీప్రోత్సాహము వలన జరుగుతున్నదని, నా జీవితం సార్థకమౌతుందని నన్ను స్వీకరిస్తారని, చేరదిస్తారని తలచుకొని ఆనంద డోలికలలో ఊగిపోయాను.... పాలు తీసుకొనివచ్చి నిలబడ్డాను.... మీరు నాచేయి పుచ్చుకొని నాతో పాలు త్రాగించారు.... నాతల నిమురుతూ "నన్ను క్షమించు సరూ" అని అన్నారు.... ఆక్షణం జీవితంలో మరపురానిది.... మధురాతిమధురమైంది. నాశరీరం పంపులు తిరిగింది, నాసుకుమార కపోలాలు జేవురించి రాగరంజితాలయినవి. నాజన్మ తరించిందనుకున్నాను.... కాని మీమాటలు విన్న నేను అలా ఎంతసేపు ఉన్నానో నాకే తెలియదు. నాకు గుర్తు వచ్చేవరకు మీఒడిలో ఉన్నాను.... నాతల మీఅంకంపై ఉంది.... ఎంతో ఆశతో మీఅంగీకారం పొంద దల్చుకున్న నాకు,.. ప్రకృతి పెట్టే గిలిగింతలకు తట్టుకోలేక అనురాగ వాహినికి ఆనకట్ట వేయలేక, అహరహమూ ఆలోచనా పరంపరలతో అలమటించే నేను.... "సరూ.... నిన్ను పెళ్ళిచేసికున్నమాట వాస్తవం....అందులో ఏమీసందేహంలేదు.నేను కాదన్నాలోకంలో ఎవ్వరూ అంగీకరించరు.... నిన్ను భార్యగా పొందిన నేను అదృష్టవంతుడిని.... కాని నిన్ను భార్యగా ప్రేమించలేకపోతున్నాను. నేను ఎంతో ప్రయత్నిస్తాను. నీ పరోక్షములో. నీతో సరసమాడాలని.... నిన్ను చక్కలిగింతలుపెట్టి నవ్వించాలని. నీకు ఆనందాన్ని ఇవ్వాలని ఎంతో ప్రయత్నించాను.... కాని అదేమిటోగాని నీ సమక్షంలో నేను అపరాధిలాగా ప్రవర్తించే

వాడిని.... నీపై మోహముగాని లేక కామముగాని నాకు లేదు.... ఆ దాహము అణపరచుకుందామని విశ్వప్రయత్నం చేశాను ఫలితం శూన్యం... నీ ప్రతిమయి నాలో గల కామాన్ని ఉద్రేకపరిచే శక్తులు లేవా... నీ Structure నాలో గల కోర్కెలను ప్రోత్సహించదా? ఎందుకు నీ దగ్గర నేను బిడియపడిపోవాలి... నీవు అనాకారివని గాని, ఆత్మ సౌందర్యము లేదని గాని, లేక స్త్రీ లక్షణాలు తక్కువని గాని, లేక స్త్రీ లక్షణాలు తప్పువని గాని, నీలో పురుషులను సమ్మోహింపచేసే శక్తి లేదని గాని చెప్పను... కాని నా మనో భావాలకు సరిపడే ప్రకృతి కాదు నీది... నన్ను కదిలించే శక్తిని నీకు పరాత్పరుడు ఇవ్వలేదేమో! నిన్ను భార్యగా నేను ఇంత వరకు చూడలేదు... ఇక ముందు చూస్తా ననే ఆశ గూడా లేదు... అయితే మీరు నన్ను ఎందుకు చేసుకున్నారు... అని నీవు అనవచ్చు.... ఆవిషయమంతా నీకు తెలుసు... అందుకు నేనే బాధ్యుడను... నాజీవితాన్నే కాకుండా మరొక జీవితాన్ని కూడా ఎడారిగా మార్చిన పాపం నన్ను దహించక మానదు... నిన్ను చూడటాని పెళ్ళిచూపులకు వచ్చిననాడు నిన్ను ఏకోణాన్నుండి చూచినా... అంతే... ఇందుకు సమాధానం ఆసృష్టికర్తకే తెలియాలి. నీవు సౌందర్యవతివి... సరసురాలివి... స్త్రీత్వం మూర్తీభవించిన మూర్తివి... ఇంతకంటే కావలసినది ఏముంది? అయితే నిన్ను భార్యగా భావించటానికి నా మనసు ఎదురు తిరిగింది... తిరుగుతుంది... ఎంతోమంది ప్రాణ స్నేహితులను అడిగాను... వారు నాకు తృప్తిగా సమాధానము చెప్పలేకపోయారు. ఈలా అని నేను మాత్రం చెట్టులాగా ఏలా ఉండగలను... నీ జీవితంలో కూడా వసంతం వెల్లివిరియాలి... అయితే నీ జీవితాన్ని సమూలంగా నలిపివేసిన నేను ఏలా సుఖపడగలను? నాకూ హృదయం ఉంది... అయితే ఏ Sentimental fact దాగికొని ఉందో కాని నీసత్యాన్ని స్వీకరించలేకపోయాను... నీకు దూరంగా ఉన్నపుడు ఎంతో ప్రయత్నం చేసేవాడిని. కాని నీ వదనం చూస్తే ఆ భావాలు శ్రావణ మేఘాలయ్యేవి. నీవు నాకు చేసిన సేవ ఏ స్త్రీ చేయలేదు... కాని నీవు చేసిన ఉపకారానికి ప్రత్యుపకారంగా నీజీవితంలో నిప్పులను పోశాను.... కాని నీవు అడగ వచ్చు అనాడే ఎందుకు చెప్పలేదు... నీకు తెలుసు.. మానాయన సంగతి... అందులో మానాయనమ్మ మంచంపై పడుకొని ఉంది. ఏనాడో మీ అమ్మ చనిపోయేటప్పుడు నిన్ను నాకిచ్చి పెళ్ళి చేస్తానని వాగ్దానం చేయించుకొని చనిపోయింది... ఆ మాట నిలబెట్టుకోమని లేకపోతే ఆబాధలోనే చనిపోతానని పట్టుపట్టింది. విధిలేక అన్ని పాశాలలో చిక్కి మన జీవితాలను ఎడారిగా చేశాను... సరూ! నీవు ఏమాటన్నా పడవలసిన బాధ్యత నాకుంది..." అని అన్నారు.

నాజీవిత కాలగమనంలో ఉత్తరాయణం ప్రారంభమైంది...'నేను ఏంపాపం చేశానని ఈసమస్యలో పాత్రగా అయ్యాను. ఇక ఈజన్మకు మాతృమూర్తినయ్యే అదృష్టము అవకాశము లేదా! సన్యాసిగా ఎండినమోడులా సంసార సుఖానికి నోచుకోలేదా! కాని మీముందు "ఫరవా లేదులెండి మీకు ఆమాత్రం కరుణ ఉన్నందుకు ధన్యురాలను... మీసంపర్కము లేకపోయినా స్నేహితురాల నయ్యానుగా" అని అన్నానేగాని నేనూ మానవ మాత్రురాలనని, స్త్రీనని ఏలా మరచిపోగలను? ఈలోకము ఒక సుందరస్వర్గధామము? ఎవరికి? అన్నీ అందుబాటులో ఉన్న మానవ సమాజానికి... కాని నాకు దారీ తెన్నూ లేని ఎడారి... ఎడారిలో కలువ ఎన్ని రోజులు జీవించగలదు? అందుకే ఈవిధంగా అంతమవుతున్నాను. నన్ను మరచిపోండి... మీరు మరలా వివాహం చేసికోండి... అయితే ఈవిధంగా కోరినానని మనసు అన్యథాభావించవద్దు ... నాకు శరీర సౌఖ్యము లేదనే భావముకంటె మీరు ఆనందానికి సౌఖ్యానికి దూరమౌతున్నారని చాలా బాధపడ్డాను... మీరు అలా ఏనాటికి బాధపడకూడదు... అందు ఏపనినైనా చేయాలనుకున్నాను... ఆలోచించాను... మీరు నన్ను కాదని మరొకరిని చేరదియ్యరని నాకు తెలుసు... నేను బ్రతికిఉండగా మీరు సుఖపడే యోగములేదు... నేను చనిపోతే మీజీవితకావ్యంలో నూతనాధ్యాయం ప్రారంభమౌతుందనుకున్నాను... అందుకు సాహసించాను... నాకు ఈక్షణం ఎంత దుఃఖ పూరితంగా ఉంది... నిజంగా ఉత్తరం వ్రాస్తుంటే మీతో మాట్లాడినట్లే ఉంది... ఒక్క కోరిక... మీసంతానంలో ఒక అమ్మాయికి నా పేరు పెట్టండి.... ఈ విధంగా కోరినానని బాధపడవద్దు... ఈ ఉత్తరం మీకు అందేవరకు నేను ఇహలోకం వదలి పరలోకంలో ఉంటాను... ఏ లోకంలో ఉన్నా నేను మీ దాననసే మాట మాత్రం మరచిపోకండేం? ఆ విధమైన జీవితం గడపలేకపోయాను. వ్యథను భరిస్తూ జీవచ్ఛవంలా బ్రతికే దానికంటే హాయిగా చనిపోదామను కున్నాను... చనిపోతున్నాననే బాధ నాకు లేదుగాని మీనుండి దూరమౌతున్నాననే క్లేశము నన్ను కలతపేస్తూనే ఉంది... ఎంత వ్రాసినా తనివి తీరటంలేదు... కాగే పాలపై నీళ్లు చల్లలేకపోయాను... నా యవ్వన ప్రవాహాన్ని అడ్డగించలేక పోయాను. ఊహాశ్వాల కళ్ళాలను లాగ లేకపోయాను... మీకు ద్రోహం తలపెట్ట లేక పోయి... ఈ నికృష్ట జీవితాన్ని నిర్మలముగా గడపలేకపోతానేమోనని చాలా బాధపడ్డాను... విడిచి వెళ్ళిపో నిశ్చయించుకున్నాను... నా వలన మీకు కళంకము రాకూడదనుకున్నాను... ఆత్మహత్య చేసికుంటున్నాను... నన్ను మరచిపోకండి.

మీ హృదయ రాణి,
సరోజిని.

ఉత్తరం పూర్తిచేసిన "వేణు" అమాంతంగా కుర్చీలో కూలబడ్డాడు. అతని చేతులలోనుండి జారిపడింది ఉత్తరం.... వస్తువు చూసినా సరోజిని జ్ఞాపకం తెస్తున్నది.... అతని తల తిరిగిపోయింది.... "సరూ" అని పెద్దగా కేకవేశాడు.... ఆ శబ్దానికి మ్మారుమోగింది హాలు.

—o—